క్లుప్తంగా

దీక్షకు సంఘీభావం

మహబూబాబాద్: ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సోమవారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బద్రినారాయణ, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేష్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎల్ఎస్ఓ కార్యాలయంలో లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్ఓ) జిల్లా ఉపాధ్యక్షుడిగా గుగులోత్ వెంకటేష్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గుగులోత్ శివవర్మనాయక్ సోమవారం తెలిపారు.

తెలంగాణ బిషప్ కౌన్సిల్ సెక్రటరీగా మల్సూర్



కురవి: సీరోలు మండల కేంద్రానికి చెందిన మల్సూర్ నాయక్ తెలంగాణ స్టేట్ బిషప్ కౌన్సిల్‌కి జనరల్ సెక్రటరీగా నియమితులైనట్లు సంస్థ ప్రెసిడెంట్ ఆర్.విక్రమ్‌పాల్ తెలిపారు. సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



దంతాలపల్లి: మండల కేంద్రానికి చెందిన సోమారపు కృష్ణ కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మృతుడి పదోతరగతి బాల్యమిత్రులు బాధిత కుటుంబానికి రూ.21,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు మంచాల శ్రీశైలం, కోట యాకయ్య, మల్ల రాజు, అశోక్, సోమారపు రవి, యాకన్న పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపిక



కేసముద్రం: పాట్నాలో ఈనెల 31వ తేదీ నుంచి జరిగే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రగ్బీ పోటీలకు మండలంలోని పెనుగొండ గ్రామ జెడ్పీహైస్కూల్‌కి చెందిన 7వ తరగతి విద్యార్థి గణేష్ ఎంపికైనట్లు ఎంఈఓ, హెచ్ఎం కాలేరు యాదగిరి తెలిపారు. ఈమేరకు విద్యార్థిని ఉపాధ్యాయ బృందం సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య, గురునాథరావు, హుస్సేన్, భీముడు, సత్యం, వెంకటగిరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్ట్?

తొర్రూరు: మత్తుకు బానిసై గంజాయి తాగుతున్న పలువురు యువకులను సోమవారం డివిజన్ కేంద్రంలో స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. యువకులకు గంజాయి ఎలా వచ్చింది, ఎంత మందికి పంపిణీ చేశారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఎస్సై ఉపేందర్ వివరణ కోరగా పట్టణంలో గంజాయి తాగుతున్న పలువురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

హద్దు మీరితే చర్యలు

దోర్నకల్: నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరి ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకుంటామని దోర్నకల్ సీఐ బి.రాజేష్ హెచ్చరించారు. సోమవారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ.. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజల భద్రత, అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భద్రత పెంచనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, ట్రిపుల్ రైడింగ్‌పై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

బయ్యారం: నూతన సంవత్సర వేడుకలను యువత ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కురవి: తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్ఐకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు మాలోత్ కిషన్ నాయక్, బానోత్ దేవానాయక్, భూక్య రాజేందర్‌నాయక్, బీకు నాయక్, దేవ్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

‘గ్రీటింగ్’ ఓ తీపి జ్ఞాపకం

- బంధానికి మారుపేరుగా ప్రత్యేకస్థానం
- గ్రీటింగ్ కార్డులకు తగ్గిన ఆదరణ
- ఇప్పుడంతా ‘స్టేటస్’లోనే శుభాకాంక్షలు



నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డు



ట్యాబ్‌లో గ్రీటింగ్ స్టేటస్

పెద్దవంగర: కాలం మారింది. ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండడంతో ఆలోచనలు కూడా స్మార్ట్‌గానే ఉంటున్నాయి. నూతన సంవత్సరం వచ్చిందంటే ఒకప్పుడు గ్రీటింగ్ కార్డులు సందడి చేసేవి. ఫ్లవర్స్, సినిమా హీరో బొమ్మలతో ఉండే కార్డుల వెనుక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ అందమైన చేతిరాతతో శుభాకాంక్షలు చెప్పేవారు. గతంలో ఏదైన సమాచారం లేదా సందేశం, మనోభావాలు వ్యక్తం చేయాలంటే డిజిటల్ ప్లాట్‌ఫాం ఉండేది కాదు. ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్ల వాడకం విపరీతంగా పెరిగింది. దీంతో చాలా మంది తమ భావాలు, సందేశాలు, అభిప్రాయాలను ‘స్టేటస్’ వేదికగా వ్యక్తం చేస్తున్నారు.

అన్నింటికి వేదిక..

పెళ్లిరోజు శుభాకాంక్షలు, మా బాబు, పాప పుట్టిన రోజు ఆశీర్వదించండి ఫ్రెండ్స్.. మా ఇంట్లో శుభ కార్యం ఉంది తప్పక రండి.. ఇలా భావమేదైన ప్రస్తుతం అంతా ‘స్టేటస్’ వేదికగానే తెలియజేస్తున్నారు. గ్రీటింగ్ కార్డుల స్థానంలో వాట్సాప్ మెసేజ్‌లు, మెయిల్స్, ఫొటో షేరింగ్స్ వచ్చి చేరాయి. స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు వచ్చి చేరడంతో గ్రీటింగ్ కార్డులకు ఆదరణ తగ్గింది. ఎలాంటి సమాచారమైన ఎంతటి దూరమైనా సెకన్లలో చేరవేసే పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో గ్రీటింగ్ కార్డులు ఓ గుర్తుగానే మిగిలిపోతున్నాయి.

తీపి గుర్తులుగా..

బంధానికి మారుపేరుగా గ్రీటింగ్ కార్డులకు ప్రత్యేక స్థానం ఉంది. పాఠశాల స్థాయినుంచి వృద్ధుల వరకు శుభాకాంక్షలు చెప్పుకునేందుకు గ్రీటింగ్ కార్డులే ఉపయోగపడేవి. క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి వేడుకలకు దుకాణాల చుట్టూ తిరిగి గ్రీటింగ్స్ కార్డులను కొనుగోలు చేసేవారు. స్నేహితులు, బంధువులను గుర్తు చేసుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపేవారు. నేడు ఆ జ్ఞాపకాలు తీపి గుర్తులుగా మిగిలిపోతున్నాయి.

ఇంటికి వెళ్లి ఇచ్చేవాళ్లం..



నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు చిన్నప్పుడు స్నేహితుల ఇళ్లకు వెళ్లి గ్రీటింగ్ కార్డులు ఒకరికొకరం ఇచ్చుకునే వాళ్లం. పాఠశాలస్థాయి నుంచి చదువులు పూర్తయ్యే వరకు కూడా స్నేహితులందరం కార్డుల ద్వారనే శుభాకాంక్షలు చెప్పుకునేవాళ్లం. గ్రీటింగ్స్ ఇచ్చి పుచ్చుకోవడంతో ఎంతో ఆనందం ఆప్యాయత కనిపిస్తుంది. ఇప్పుడా పరిస్థితి లేదు.

– మాధవపెద్ది వాణి, ఉపాధ్యాయురాలు

డిమాండ్స్ డేను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జనవరి 9న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని అఖిల భారత యునైటెడ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో డిమాండ్స్ డే పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగ పోరాటాల ద్వారా రద్దైన నల్లచట్టాలను అమలు చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూనెం ప్రభాకర్, పైండ్ల యాకయ్య, కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు, ఉమ్మగాని సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ నాయకులు సంఘం జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా పట్ల మధు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని హైస్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంధసిరి జ్యోతిబసు, మనోజ్, వరుణ్, పూజేష్, స్వప్న పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతాం..

- ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి పీరయ్య



మాట్లాడుతున్న పీరయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఫిబ్రవరి 3వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు మహాప్రదర్శన, సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ మాదిగ పిలుపునిచ్చారు. ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరు ఎన్ని అడ్డంకులు తీసుకువచ్చిన ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన వర్గీకరణ కోసం మాదిగ, ఉపకులాలు, మేధావులు, ఉద్యోగులు హైదరాబాద్‌కు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోలెపాక ఎల్లయ్య, మిడతపల్లి యాకయ్య, ప్రవీణ్, రవి, సోమయ్య, సైదులు, వెంకన్న, దయాకర్ పాల్గొన్నారు.

సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి

నెల్లికుదురు: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వై.యాకయ్య డిమాండ్ చేశాడు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాలరాజుకు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు, సంపత్ కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

గార్ల: సమగ్ర సర్వే రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని సోమవారం ఎంపీడీఓ మంగమ్మకు టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు పాపావత్ యాదగిరి, బాలాజీనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కేసముద్రం: మండల కేంద్రంలో జై కిసాన్ రైతు సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మూల భూలోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గండి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కొమ్మాల్‌రెడ్డి, పాపారావు పాల్గొన్నారు.

మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



నెహ్రూసెంటర్: నిరసన తెలుపుతున్న నాయకులు



తొర్రూరులో..

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కురవిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద..

భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

గార్ల: రైల్వే మూడోలైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి పాక వెంకన్న మాట్లాడారు. మద్దివంచ గ్రామ సమీపంలో 116 సర్వే నంబర్‌లో గల భూములను తాత ముత్తాతల నుంచి పంటసాగు చేసుకొని జీవిస్తున్నామని, అయితే రైల్వే మూడో లైన్ నిర్మాణంలో 16మంది నిరుపేద రైతులు భూములు కోల్పోయారని అన్నారు. కార్యక్రమంలో రైతులు మల్లేష్, శ్రీరాములు, వెంకన్న, రంగారావు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి..

- బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్



నెల్లికుదురు: మాట్లాడుతున్న మదన్

నెల్లికుదురు/దంతాలపల్లి: మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, పార్టీ అంటేనే మోసమని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను రేవంత్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. హామీలను అమలు చేయకుంటే ప్రజలే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భవాని ప్రసాద్, నాయకులు రాజ్‌కుమార్ యాదవ్, పాపారావు, ప్రభాకర్ రెడ్డి, సురేష్, నవీన్, రమేష్ పాల్గొన్నారు.

సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ



మహబూబాబాద్ అర్బన్: జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకర బోర్డు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సాంఘిక శాస్త్ర మండలస్థాయి పోటీలు నిర్వహించారు. గణశ్యాం, లహరి, సంధ్య, కావేరి విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం మాలోత్ కోట్యానాయక్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్వరూపరాణి, ఉమాదేవి, వసంత పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో సోమవారం మండలస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పోటీలను తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. బి.సావిత్రి, డి.దేవేందర్, జి.దివ్య ప్రతిభ కనబచ్చారు. జనవరి 4వ తేదీన జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని సోషల్ ఫోరం కన్వీనర్ డాక్టర్ జి.చంద్రమౌళి తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ రవికుమార్ అభినందించారు.

మరిపెడ రూరల్: మండలస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ తెలుగు మీడియం విభాగంలో మండలంలోని వీరారం హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి శ్రీకాంత్ అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఎంఈఓ అనితాదేవి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్నాడు. హెచ్ఎం లక్ష్మీ నిర్మల, ఉపాధ్యాయులు మధు, జానకీ, మరెడ్డి, వెంకట్ అభినందించారు.

తొర్రూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. కంఠాయపాలెం విద్యార్థులు రిషిక, నవ్యశ్రీలు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా బ్రహ్మానందరెడ్డి వ్యవహరించగా ఉపాధ్యాయులు శంకర్, అనంతరెడ్డి, యాకూబ్‌అలీ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తొర్రూరు రూరల్: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెర్లపాలెం గ్రామానికి నిరుపేద యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కుమార్‌గౌడ్, సురేందర్ రాథోడ్, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అల్పాహారం పంపిణీ

గార్ల: హైదరాబాద్‌కు చెందిన ముస్లిం మైనారిటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గార్లలోని బాలికోన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఎస్సై ఎస్‌కె రియాజ్ పాషా చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాచర్ల సుందర్‌కుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

నెల్లికుదురు: సామాన్యుల స్వరమైన డిజిటల్ మీడియాకు చట్టబద్ధత కల్పించాలని డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈనెల 21 నుంచి జనవరి 5వరకు తలపెట్టిన డిజిటల్ మీడియా జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సంతకాల సేకరన కార్యక్రమం చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొన్న వృద్ధుడి మృతి

దంతాలపల్లి: మండల కేంద్రం అంబేడ్కర్ సెంటర్‌లో ఈనెల 26న మండలంలోని వెంకట్యతండాకు చెందిన యాచకుడు బానోత్ బిక్కు (72) ట్రాక్టర్ ఢీకొన్న విషయం విధితమే. సూర్యాపేట జిల్లా అడ్డగూడూరు మండలం రాపాక గ్రామానికి చెందిన రాపోలు కనకయ్య ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించే క్రమంలో ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై పిల్లల రాజు సోమవారం తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: హైదరాబాదులో జరగనున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడలకు మానుకోట కరాటే అకాడమీ విద్యార్థులు వెళ్లారని కరాటే మాస్టర్ పాపావత్ ఈరునాయక్ సోమవారం తెలిపారు. మానుకోట కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు నర్సింహ, శివరాం, సుధ క్రీడల్లో పాల్గొనేందుకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్ నుంచి వెళ్లారన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

గార్ల: చెడు వ్యసనాలను వీడి సన్మార్గంలో పయనించేందుకు క్రీడలు దోహదపడతాయని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వీరునాయక్ అన్నారు. సోమవారం పీవైఎల్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరంను పురస్కరించుకొని మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామంలో 5మండలాల క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సక్రు, మంగీలాల్, శివ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పును కుదించాలి

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ నుంచి కేసముద్రం విలేజ్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డు వెడల్పు 80ఫీట్లు కాకుండా, 60ఫీట్ల వరకు కుదించాలని కోరుతూ సోమవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి పలువురు ఇళ్లు, దుకాణదారులు వినతిపత్రాన్ని అందజేశారు.

నల్లగొండకు తరలిన సీపీఐ నాయకులు

నెహ్రూసెంటర్/కురవి: సీపీఐ వందేళ్ల ప్రారంభ సభ సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి సీపీఐ నాయకులు, శ్రేణులు సోమవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, తండ సందీప్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

మహబూబాబాద్: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న మార్యదపూర్వకంగా కలిశారు.

క్షీరాభిషేకం

కేసముద్రం: ధరణి వెబ్‌సైట్‌లో రైతు పేరు, తండ్రి పేరు పట్టాకాలంలో వస్తున్న అడవి పేరును తొలగించడంపై హర్షిస్తూ మండలంలోని నారాయణపురం రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవినాయక్, రైతులు పాల్గొన్నారు.

రచయితకు సన్మానం

కొత్తగూడ: మారుమూల ఏజెన్సీ గ్రామానికి చెందిన రచయిత ఈసం అమర్‌నాథ్‌కు ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో గుర్తింపు లభించింది. విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో సినీగేయ రచయితలు భువనచంద్ర, కోస రాజుల చేతుల మీదుగా శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

అనుమతి లేని ఫార్మసీ సీజ్

తొర్రూరు: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనుమతి లేకుండా కొనసాగుతున్న ఫార్మసీని అధికారులు సీజ్ చేశారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని పలు మెడికల్ షాపులను డ్రగ్ పర్యవేక్షణాధికారి ఉమారాణి తనిఖీ చేశారు. నిర్వాహకుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. పట్టణంలోని కవితా ఆస్పత్రిలో ఫార్మసిస్టు లేకుండా ఫార్మసీ కొనసాగిస్తున్నందున సీజ్ చేసినట్లు తెలిసింది.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్/మహబూబాబాద్: టీయూడబ్ల్యూజేహెచ్ 143 మహబూబాబాద్ అర్బన్ నూతన కమిటీని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈరగాని భిక్షం, జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కోకన్వీనర్ గాడిపెల్లి శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ఐఎంఏ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమాండ్ల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇరుకుళ్ల కిరణ్‌కుమార్, రాసూరి లక్ష్మణ్, అంబటి వెంకన్న, గంధసిరి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా నల్లకుంట్ల కరుణాకర్, కోశాధికారిగా తప్పెట్ల రాజు, సహాయ కార్యదర్శులుగా రాంచంద్రు, రాజ్‌కుమార్, శ్రీధర్, చక్రధర్, రమేశ్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో బీఆర్ఎస్ నుంచి సోమవారం కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరగా వారికి అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ ఆంగోత్ భీమానాయక్, పార్టీ టౌన్ ప్రధాన కార్యదర్శి బండారు చిరంజీవి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల శివయాదవ్, యాకూబ్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

40క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం బస్తాలు

పెద్దవంగర: అక్రమంగా తరలిస్తున్న 40క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం దయ్యంబండతండాకు చెందిన మడోతు కల్యాణ్, మడోతు వినోద్‌లు మండలంలోని పలు గ్రామాల్లో రూ.80వేల విలువ చేసే 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి కొనుగోలు చేసి నిల్వ చేశారు. ఏదైన వాహనాన్ని కిరాయికి తీసుకొని హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధమయ్యారు. నమ్మదగిన సమాచారం మేరకు బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీఆర్టీలను రెగ్యులరైజ్ చేయాలి



సమ్మెలో పాల్గొన్న సీఆర్టీలు

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న సీఆర్టీలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీఆర్టీ ఉపాధ్యాయుడు గుగులోత్ చిట్టిబాబు డిమాండ్ చేశాడు. ఐటీడీఏ ఏటూరునాగరంలో సోమవారం మానుకోట జిల్లా 19గిరిజన ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలు 8వ రోజు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఆర్టీలు కూనుసోత్ దేవేందర్, గుగులోత్ బావ్‌సింగ్, బానోత్ హనమంతు, బాలాజీ నాయక్, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.